క్లుప్తంగా

దామోదరకు సన్మానం



దామోదర రాజనర్సింహాను సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులుగా నియమితులైన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహాను మంగళవారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కలిసి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జీగా నియమితులైన తమిళనాడుకు చెందిన ఏఐసీసీ సభ్యులు మునియప్పను సురేశ్ షెట్కార్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డిలకు చెందిన నాయకులు బాలరాజ్, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మునియప్పను సన్మానించారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై చర్చించారు.

‘ఓటర్ల నమోదు బాధ్యత బీఎల్‌ఓలదే’

కల్హేర్(నారాయణఖేడ్): కొత్తగా ఓటర్ల పేర్లను నమోదు చేయడంలో బీఎల్‌ఓలు పూర్తి బాధ్యతగా పనిచేయాలని నారాయణఖేడ్ ఆర్డీఓ వెంకటేశం సూచించారు. మంగళవారం కల్హేర్‌లో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జనాభా ప్రకారం ఖేడ్ నియోజకవర్గంలో 67శాతం మంది ఓటర్లుగా ఉండాలని తెలిపారు. ఇంకా 26వేల మందిని కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఇంటా తిరిగి ఫారం 6 తీసుకుని ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వర్ రావు, ఆర్ఐ ప్రమోద్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో చేపట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులను మంగళవారం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్రో వాటర్ వర్క్స్ జీఎం నారాయణ అధికారులను అడిగి పనులు తీరును తెలుసుకున్నారు. పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: కుంపు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషన్ షావోలిన్, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తోపాజి అనంత క్రిష్ణ హాజరై బ్లాక్ బెల్ట్ సాధించిన విజయలక్ష్మి, భారతికి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు కంటేశ్వర్‌రావు, మల్లేశం, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సునీత, డీఐఓ గోవిందరాజులు, శ్రీనివాస్, మ్యాడమ్ రాధాకిషన్, తోపాజీ హరీష్, కొంపల్లి విద్యాసాగర్, సుధాకర్, బుచ్చిలింగం తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభ కరపత్రం ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్: ఈ నెల 27వ తేదీ సంగారెడ్డి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ప్రజా గాయకుడు గద్దర్ అన్న యాదిలో పేరున నిర్వహించనున్న సంస్మరణ సభ కరపత్రాలను బహుజన ప్రజాసంఘాల నాయకులు మంగళవారం ఐబీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, అనంతయ్య, దుర్గాప్రసాద్, ప్రేమానందం, అశోక్, వేణుగోపాల్, శ్రీనివాస్, పవన్, విద్యాసాగర్, చంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో 2వ వార్డులో నూతనంగా నిర్మించనున్న యూజీడీ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కుడికుంట సమీపంలో నిర్మిస్తున్న బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు శుభాకాంక్షల వెల్లువ

పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మూడోసారి ప్రకటించడంపట్ల అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఘన స్వాగతం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే టికెట్ సాధించిన తరువాత హైదరాబాద్ నుంచి మంగళవారం జహీరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

కోహీర్ మండలంలో

కోహీర్(జహీరాబాద్): మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ సాధించడంతో ఎమ్మెల్యే మానిక్‌రావుకు మండలంలోని కొత్తూరు(డి) గ్రామంలో 65 నంబరు జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, సర్పంచులు నర్సింహులు, రవికిరణ్, శ్రీనివాస్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

రాయికోడ్(అందోల్): మండలంలోని పీపడ్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకులు అనిల్‌కుమార్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను పోతులబొగుడలోని ఎమ్మెల్యే నివాసంలో సన్మానించారు. రెండోసారి ఎమ్మెల్యేగా టికెట్ పొందిన సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అమృత్‌పాటిల్, నగేష్ పాల్గొన్నారు.



పటాన్‌చెరు: ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



సదాశివపేట: చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు



జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్యే మాణిక్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నిండు మనస్సుతో దీవించండి

సదాశివపేట(సంగారెడ్డి): నియోజకవర్గ ప్రజలు నిండు మనస్సుతో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ నియోజకవర్గ ప్రజలను కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా చింతా ప్రభాకర్ ప్రకటించడంతో సదాశివపేట పట్టణంలోని అయన క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్లు అకుల శివకుమార్, శ్రీనివాస్, గుండు రవి, వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఘనంగా సన్మానించారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం పోతులబోగుడాలోని తన నివాసంలో టేక్మాల్ మండలం కోరంపల్లి, పుల్కల్ ముదిమాణిక్యం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని వివరించారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టేక్మాల్, పుల్కల్ మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు భక్తుల వీరప్ప, విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టికెట్ కేటాయించాలని దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న సంజీవరెడ్డి



దరఖాస్తు అందజేస్తున్న గోపాల్

నారాయణఖేడ్: రానున్న ఎన్నికల్లో నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి మంగళవారం దరఖాస్తు సమర్పించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తును అందజేశారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాథోడ్, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

జహీరాబాద్ నియోజకర్గం నుంచి..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టికెట్ కేటాయించాలని మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లికి చెందిన న్యాయవాది, మాజీ సర్పంచ్ గోపాల్ దరఖాస్తు చేసుకున్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని నాయకులతో కలిసి మంగళవారం ఆయన హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ జహీరాబాద్ ఎస్సీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతూ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

చెరకు రైతులను ఆదుకోవాలి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంత చెరకు రైతుల ప్రభుత్వం ఆదుకోవాలని కర్నాటక రాష్ట్రంలోని బీదర్ దక్షణ నియోజకవర్గం ఎమ్మెల్యే శైలేంద్ర బెళదళే డిమాండ్ చేశారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం హోతి(బి) గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తులు క్రషింగ్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు రైతు సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంచందర్, రాజనర్సింహ్మా, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి గుర్తింపు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని మనూరు క్రాస్ రోడ్డులో మూడురోజుల క్రితం నీటిగుంతలో పడి మృతి చెందిన వ్యక్తి మహారాష్ట్రకు చెందినవాడిగా గుర్తించారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. మూడురోజుల క్రితం నీటిగుంతలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతిచెంది పడి ఉండటాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు. అతడి వివరాల కోసం ఆరా తీయగా అతడిది మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ఉమర్‌ఖేడ్‌కు చెందిన రాజుజాదవ్ (37)గా నిర్ధారించారు. అతడి అక్కా, బావ గత కొన్నేళ్లుగా ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ శివారులోని కోళ్ల ఫారంలో పనిచేస్తున్నారు. కొన్ని నెలల కిందట రాజుజాదవ్ బతుకుదెరువు కోసం ఖేడ్ వచ్చి దొరికిన కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న అక్కాబావల వద్దకు వెళ్తున్న క్రమంలో మద్యం మత్తులో ఉండటంతో ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి చికిత్సకు చేయూత

నారాయణఖేడ్: పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన నయీం కుమారుడు ఇటీవల నీళ్లుగా భావించి యాసిడ్ తాగి తీవ్ర అనారోగ్యానికి గురికాగా నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడి కుటుంబం పేద కుటుంబం కావడంతో చికిత్స నిమిత్తం హెల్పింగ్‌హ్యాండ్స్ సేవా సమితి బాధ్యులు మంగళవారం రూ.25వేల ఆర్థిక సహాయాన్ని నయీం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్ తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్ తహసీల్దార్ బదిలీ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావును కలెక్టరేట్‌లోని డి సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ శరత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చిన బాలశంకర్‌ను కల్హేర్ తహసీల్దార్‌గా నియమించారు. నిజాంపేట్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న మదన్‌ను సంగారెడ్డిలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహేశ్‌ను అదనపు బాధ్యతలతో నిజాంపేట తహసీల్దార్‌గా నియమించారు.

బేటీ బచావో–బేటీ పడావోపై అవగాహన

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి పాఠశాలలో బేటీ బచావో–బేటీ పడావో పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ పల్లవి బాలల హక్కులు, చట్టాలు, బాలలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలికల ఆరోగ్య జాగ్రత్తలు, బాల కార్మికుల నివారణ, బాలల హెల్ప్ లైన్ నెంబర్స్–1098, మహిళా హెల్ప్ లైన్‌నెంబర్స్–181, 100 గురించి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి సంఘటనలపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, విశాల, ఫైనాన్షియల్ లిట్రసీ హానిషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సాధికారత అధికారులు

బీఆర్‌ఎస్‌లో చేరిక

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని రెండు గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఖేడ్ మండలం హుక్రాన (జి)కు చెందిన కాంగ్రెస్‌కు చెందిన వార్డుసభ్యుడు బారి శంకర్‌తో పాటు నాయకులు రాములు, దశరథ్, లక్ష్మయ్య, శివకుమార్, నవీన్‌కుమార్, కల్హేర్ మండలం బీబీపేట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పాపయ్య, సాయిలు, మోషయ్య, మల్‌గొండ, సంజీవులు, ప్రభాకర్ బీజేపీకి చెందిన అంజిరెడ్డి, గోపాల్, ఎల్లాగౌడ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు నవాబ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో నాయకులు

విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థులతో క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రామచంద్రాపురం క్లాస్ మేట్ క్లబ్ అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించికొని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం జయప్రకాష్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తూ అనేక సేవా కార్యక్రమాలను చేపడతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి



రాములు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ఉద్యకారులను గుర్తించి పదువుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని ఉద్యమకారుడు, రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు రాములు నేత అన్నారు. పట్టణంలోని అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సైనికుడిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, మంత్రి హరీశ్‌రావుతో కలిసి పోరాటం చేశానని గుర్తచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేశానని తెలిపారు. ప్రభుత్వం తనను తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తించి ఏదైన పదవి ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. మంత్రి హరీశ్‌రావుపై ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వాఖ్యలను ఆయన ఖండించారు.

బీఆర్‌ఎస్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని దళితబంధు సాధన సమితి కన్వీనర్ పోలీస్ రాంచందర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లిలో దళితబంధు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హలో దళితుడా.. చలో సంగారెడ్డి అనే కార్యాక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాంచంద్రయ్య మాట్లాడుతూ ఆగస్టు 29న నిర్వహించనున్న హలో దళితుడా.. చలో సంగారెడ్డి కార్యక్రమాని జిల్లాలోని దళితులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు రత్నం, ప్రేమానందం, కిషోర్, అభిషేక్, భాస్కర్, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

హత్నూర(సంగారెడ్డి): మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని డీపీఎం రవీందర్ అన్నారు. హత్నూర ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శిరీష అధ్యక్షతన మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డీఆర్డీఏ డీపీఎం రవీందర్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా గతంలో రుణాలు తీసుకున్న మహిళా సంఘాలు నిర్ణీత గడువులోగా చెల్లించాలని సూచించారు. హత్నూర మండల సమాఖ్యకు మరో రూ.44 కోట్ల రుణాలు ఇచ్చేందుకు టార్గెట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, సీసీలు మహేష్, కిష్టయ్య, నాగరాణి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల కేంద్రంలో దివంగత నేత విగ్రాహం రామగౌడ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రముఖ హస్పిటల్స్‌కు చెందిన వైద్యనిపుణులు రోగులకు ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, మనూరు మాజీ సర్పంచ్ సంగమణి సంజీవ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ముదిరాజ్‌లను విస్మరించడం బాధాకరం**

జహీరాబాద్: ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వకపోవడం అన్యాయమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు అన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లోని భవానీ మాతను దర్శించుకునేందుకు వెళ్తూ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 60లక్షల అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లను సీఎం కేసీఆర్ పూర్తిగా విస్మరించారని వాపోయారు. దైవదర్శనం అనంతరం జాతీయ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. తమకు పదవులు ముఖ్యం కాదని, ఆత్మగౌరవం ముఖ్యమన్నారు. ఆయన వెంట నాయకులు నగేష్, తుల్జారాం, చంద్రశేఖర్, నర్సింహులు, కొండాపూరం నర్సింహులు పాల్గొన్నారు.

◆ **మొక్కలకు ఆత్మీయ పలకరింపు**



మునిపల్లి(అందోల్): హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కలకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బుదేరా నుంచి మునిపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న మొక్కలను సంరక్షించడంలో భాగంగా వాటి ఎదుగుదల సక్రమంగా ఉండేలా చూసేందుకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీడీఓ హరినందర్‌రావు, ఎంపీఓ అంజలిదేవి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ **వాయిస్ 4గర్ల్స్ శిబిరం ప్రారంభం**

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం కౌమార వయసు బాలికలకు వాయిస్ 4 గర్ల్స్ శిబిరాన్ని ప్రారంభించారు. వాయిస్ 4 గర్ల్స్ అనే సామాజిక సంస్థ ఈ శిబిరాలను నిర్వహిస్తుంది. శిక్షణ పొందిన డిగ్రీ కళాశాల విద్యార్థినులకు, కౌమార దశ బాలికలకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఇంగ్లీష్ భాషపై పట్టు, నాయకత్వ లక్షణాలు పెంపొందిండం వంటి అంశాలపై శిక్షకులు అవగాహన కల్పిస్తారు. రంజోల్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నారు.

◆ **రామచంద్రాపురం తహసీల్దార్‌గా సంగ్రంరెడ్డి**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం తహసీల్దార్‌గా సంగ్రంరెడ్డి మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

◆ **పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి**



హత్నూర(సంగారెడ్డి): గ్రామ పంచాయతీలలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సంగారెడ్డి డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తురకల ఖానాపూర్, ముచ్చర్ల, మంగాపూర్, కొత్తగూడెంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా తురకల ఖానాపూర్‌లోని మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం మంగాపూర్, కొత్తగూడెం, ముచ్చర్ల గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ సువర్ణ సర్పంచ్‌లు మాధవి, రమేష్‌నాయక్, అనిత, యాదగిరి, యాదయ్య, ఎంపీటీసీ మీనంపల్లి కిషన్ రావు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

◆ **విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ ఆలయ సమీపం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్‌యాదవ్, మల్లేష్, మహేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **లైసెన్స్‌ల పంపిణీ**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్తూర్ గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో డ్రైవింగ్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం స్థానిక నాయకులు యువకులకు మంజూరైన లైసెన్సులను అందజేశారు. ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి యువకులు ధన్యవాదాలు తెలిపారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**



రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామానికి చెందిన గొల్ల మల్లేశంకు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1,00,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కర్చల్ గ్రామ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధప్ప పాటిల్, నాయకులు మనిల్‌కుమార్, సల్మాన్‌ఖాన్ పాల్గొన్నారు.